ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 31 ఆగస్టు 2024

అధికారంలో ఉన్నాం.. అణిగి మణిగి ఉండండి



విశాఖ నగర శివారునున్న చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి లోకేశ్

ఎవరూ విర్రవీగొద్దు...

- ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి
- కూటమిలో మిగిలిన పార్టీలతో కలిసి పనిచేయండి
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, నేతలకు మంత్రి నారా లోకేశ్ సూచన
- అక్టోబరు నుంచి పార్టీ సభ్యత్వ నమోదు
- కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు
- అందరూ కలిసికట్టుగా అభివృద్ధికి కృషి చేయాలి



విశాఖపట్నం జిల్లా భీమిలి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులతో మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):

అధికారంలోకి వచ్చాం కదా అని విర్రవీగొద్దని, అణిగిమణిగి ఉండాలని ప్రజా ప్రతినిధులకు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జులకు, నేతలకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీకి 151 సీట్లు ఇస్తే అధికారం తలకెక్కి...అరాచక పాలన సాగించి ప్రజాగ్రహానికి గురైందని గుర్తుచేశారు. క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం, మిత్రపక్షాలైన ... మిగతా 8వ పేజీలో



మొక్కలు నాటి సంరక్షించాలి

స్పీకర్ అయ్యన్న

మొక్కను నాటి నీరు పోస్తున్న అయ్యన్నపాత్రుడు. పక్కన ఎమ్మెల్యేలు కొణతాల, సుందరపు

ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, కలెక్టర్ విజయకృష్ణన్‌లతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల పెంపకంలో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేయాలని సూచించారు. -వార్త 7వ పేజీలో

జ్వరాల విజృంభణ

మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్స్ బారిన ప్రజలు

అనకాపల్లి(ఆంధ్రజ్యోతి)/నర్సీపట్నం, ఆగస్టు 30 :

పారిశుధ్యంలోపం, అడపాదడపా కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాలు, పట్టణాలు అన్న తేడాలేకుండా పలురకాల జ్వరాలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు స్థానిక సంస్థల అధికారులు, సిబ్బంది కనీస చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు మలేరియా, డెంగ్యూ జ్వరాలబారిన పడుతున్నారు. దీనికి తోడు వర్షాకాలం కావడంతో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. చిన్న పిల్లల్లో వైరల్ జ్వరాల ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నది. తీవ్రమైన జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైరల్ జ్వరాలతో బాధపడుతూ చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. పరిస్థితి తీవ్రంగా వుంటే ఇన్‌పేషెంట్లుగా చేరి వైద్య సేవలు పొందుతున్నారు. దీంతో జ్వర బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

- ఆగస్టులో భారీగా పెరిగిన రోగులు
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వెయ్యి మందికిపైగా చికిత్స



నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి సాధారణ వార్డులో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

దోమల బెడద కారణంగా ప్రజలు మలేరియా, డెంగ్యూ జ్వరాలబారిన పడుతుండగా నీటి కాలుష్యం, పారిశుధ్యలోపం వల్ల టైఫాయిడ్‌కు గురవుతున్నారు. గత ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు జిల్లా వ్యాప్తంగా 11,567 మంది జ్వరాలబారిన పడగా, ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు 12,693 మంది జ్వరాలబారిన పడ్డారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం గత ఏడాది ఆగస్టు వరకు 113 మలేరియా కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 195 కేసులు నమోద య్యాయి. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి రోజూ 500 నుంచి 700 మంది వైద్య పరీక్షల కోసం వస్తుండగా, వీరిలో 200 మందికిపైగా జ్వర బాధితులే ఉంటున్నారు. అనకాపల్లి మండలం తగరంపూడి పీహెచ్‌సీకి గతంలో రోజుకు 20 మంది జ్వరబాధితులు చికిత్స కోసం రాగా, ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపు అయ్యిందని వైద్యులు చెబుతున్నారు.

నర్సీపట్నం ఆస్పత్రికి రోగుల తాకిడి

నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి జూన్, జూలై నెలలతో పోలిస్తే ఆగస్టులో జ్వర పీడితుల తాకిడి ఎక్కువగా ఉంది. జూన్‌లో 390 మంది, జూలైలో 789 మంది జ్వరబాధితులు వైద్య సేవలు పొందగా, ఆగస్టులో 1,046 మంది చికిత్స పొందారు. ఇన్‌పేషెంట్ విభాగంలో జూన్‌లో 129, జూలైలో 178, ఆగస్టులో 181 మంది చేరారు. కాగా డెంగ్యూ, మలేరియా బారినపడి చికిత్స పొందుతున్న రోగుల వివరాలు ఏరియా ఆస్పత్రిలో నమోదు కావడం లేదు. స్థానిక ఆస్పత్రిలో రక్త పరీక్ష చేయించుకుని.. డెంగ్యూ లేదా మలేరియా పాజిటివ్ రిపోర్టు వస్తేనే నమోదు చేస్తున్నారు.

ఇక నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని కృష్ణాదేవిపేట, గునుపూడి, మాకవరపాలెం, బూరుగుపాలెం, గొలుగొండ, నాతవరం, వేములపూడి, చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆగస్టు నెలలో సుమారు మూడు వేల మంది జ్వరబాధితులు వచ్చి చికిత్స పొందారు. కృష్ణాదేవిపేటలో రెండు మలేరియా కేసులు నమోదు అయ్యాయి. గొలుగొండ, నాతవరంలో రెండు డెంగ్యూ కేసులు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.

నేతవానిపాలెంలో డెంగ్యూ

మండల కేంద్రమైన బుచ్చెయ్యపేట పంచాయతీ శివారు నేతవానిపాలెంలో ... మిగతా 8వ పేజీలో

ముసురు!

అల్పపీడనం ప్రభావంతో మోస్తరు వర్షం

- కె.కోటపాడులో అత్యధికంగా 23.4 మి.మీ.ల వర్షపాతం
- వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం
- నేడు భారీ వర్షం కురి అవకాశం



రాంబిల్లి మండలం అప్పన్నపాలెం కాలనీ జంక్షన్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

అనకాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్రఅల్పపీడనం ప్రభావంతో శుక్రవారం జిల్లా అంతటా ముసురు వాతావరణం నెలకొంది. గురువారం అర్ధరాత్రి నుంచి దఫదఫాలుగా వర్షం కురుస్తున్నది. తీవ్రఅల్పపీడనం శనివారంనాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు వున్నాయని అధికారులు ప్రకటించారు. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలన్నారు. సముద్రం వెంబడి బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. కాగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల రోజంతా తేలికపాటి జల్లులు కురుస్తూనే ఉన్నాయి. కె.కోటపాడు మండలంలో అత్యధికంగా 23.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... అత్యల్పంగా మునగపాక మండలంలో 4.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. పాయకరావుపేటలో 19.6 మిల్లీమీటర్లు, మాకవరపాలెంలో 18.2, చోడవరంలో 15.5, నక్కపల్లిల్లో 14.4, రావికమతం, ఎలమంచిలిలో 13.3, అనకాపల్లిలో 13, కశింకోటలో 11.2, కోటవురట్లలో 10.7, నాతవరంలో 10.2, ఎస్.రాయవరంలో 9.8, రోలుగుంటలో 9.5, సబ్బవరంలో 9.2, నర్సీపట్నం, గొలుగొండల్లో 8.8, పరవాడలో 8, బుచ్చెయ్యపేటలో 7.8, రాంబిల్లిలో 7.4, అచ్యుతాపురంలో 7, మాడుగులలో 6.4, దేవరాపల్లిలో 6, చీడికాడలో 5.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వరినాట్లు వేయడానికి, ఇప్పటికే వేసిన వరినాట్లుకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా ఇప్పటికే అధ్వానంగా వున్న రహదారులు.. వర్షాలతో మరింత ఛిద్రం అవుతున్నాయి. రోడ్లపై ఏర్పడిన గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఎట్టకేలకు సాకారం

పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన

- ఎనిమిదేళ్ల క్రితం టీడీపీ హయాంలో చేపల జెట్టీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- భూమి కేటాయింపు, రూ.350 కోట్లు మంజూరు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క అడుగు కూడా ముందుకుపడని వైనం
- ప్రకటనలతో మత్స్యకారులను మభ్యపెట్టిన నాటి పాలకులు
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర నెలల్లోనే శంకుస్థాపన
- ఏడాదిన్నరలో నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యం



పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్న ప్రదేశం ఇదే..

అచ్యుతాపురం, ఆగస్టు 30:

అచ్యుతాపురం మండలం పూడిమడక మత్స్యకారుల కల ఎట్టకేలకు నెరవేరనున్నది. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.387 కోట్ల వ్యయంతో చేపట్టనున్న చేపల జెట్టీ నిర్మాణం ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చెప్పడంతో మత్స్యకారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎనిమిదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని నిర్ణయించింది. ఒక ప్రైవేటు సంస్థతో సర్వే చేయించింది. ఈ ప్రాంతం అన్ని విధాలా అనుకూలంగా వుంటుందని నివేదిక ఇవ్వడంతో స్థల పరిశీలన చేయించి భూమిని కేటాయించింది. కానీ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇదిగో ఫిషింగ్ హార్బర్... అదిగో చేపల జెట్టీ అంటూ ప్రకటనలతోనే కాలం వెళ్లదీసింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడక నుంచి ఏటా భారీ స్థాయిలో చేపల ఎగుమతులు జరుగుతుంటాయి. కానీ ఇక్కడ పడవలు నిలుపుకోవడానికి సరైన సదుపాయం లేకపోవడంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య సుమారు పదేళ్ల క్రితం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ దృష్టికి వచ్చింది. నాటి సీఎం చంద్రబాబు 2016 జూలైలో అచ్యుతాపురం సెజ్‌కు వచ్చిన సందర్భంగా పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని ప్రకటించారు. సర్వే చేసే బాధ్యతను వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ (వాప్‌కాస్) సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ పలుమార్లు సర్వేలు నిర్వహించి ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ఈ ప్రదేశం అనుకూలమేనని నివేదిక ఇచ్చింది. చేపల వేట అనంతరం మత్స్యకారులు పడవలను నిలుపుకునేందుకు ఉప్పుటేరును లోతు చేయాలని, పల్లిపేట శివారులోని రుద్రభూమి నుంచి పొగిరి వరకు మూడు కిలో మీటర్ల మేర రోడ్డు వేయాలని సూచించింది. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అవసరమైన 35 హెక్టార్లను పూడిమడక పంచాయతీ సర్వే నంబర్ 139లో కేటాయించారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.350 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. తదుపరి సర్వేలు జరుగుతుండగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఆటకెక్కింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పూడిమడకలో హార్బర్ నిర్మిస్తామని పలుమార్లు ప్రకటించారు. సుమారు ఏడాది క్రితం రూ.387 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. 'విశ్వ సముద్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీ'కి టెండర్ దక్కింది. హార్బర్ నిర్మాణ వ్యయంలో రూ.87 కోట్లు కేంద్రం ఇస్తుంది. మిగిలిన రూ.300 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. కానీ వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. కానీ అప్పటి సీఎం జగన్ మూడుసార్లు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 2022 జూలై 20వ తేదీన నెల్లూరు జిల్లా రామయ్యపట్నంలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన (జగన్) మాట్లాడుతూ.. రాష్ట్రంలో ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లిలోని ఒక ప్రైవేటు పార్సిల్ ఆఫీస్‌లో జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

గంజాయి రవాణా కట్టడికి జాగిలాలు

- పార్సిల్ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు

గంజాయి రవాణాను నిరోధించడానికి జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పరవాడ ప్రాంతాల్లో వున్న పలు పార్సిల్ సర్వీస్ కార్యాలయాల్లో జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. - వార్త 7వ పేజీలో

జిల్లా ప్రత్యేక అధికారిగా డాక్టర్ శ్రీధర్



అనకాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ప్రత్యేక అధికారిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమ పథకాలు, ఇతరత్రా కార్యక్రమాల అమలును పర్యవేక్షించడానికి రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని ప్రభుత్వం నియమించింది. ప్రత్యేక అధికారి హోదాలో చెరుకూరి శ్రీధర్ జిల్లా కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్షలు జరుపుతారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా పర్యవేక్షిస్తారు.

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య


వేమల మహేష్ (ఫైల్‌ఫొటో)

కృష్ణాదేవిపేట, ఆగస్టు 30: పురుగుమందు తాగి ఓ యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన వేమల మహేష్ (33) శుక్రవారం తెల్లవారుజామున పురుగుమందు తాగాడు. అతడిని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచాడు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మేనమామ కొండబాబు ఫిర్యాదు మేరకు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రెండు ఆలయాల్లో హుండీలు చోరీలు

దేవరాపల్లి, ఆగస్టు 30: రైవాడలోని రెండు ఆలయాల్లో హుండీలు గురువారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. రైవాడ జలాశయం ఆనుకొని గట్టు దిగువ ఉన్న గ్రామ దేవత ఎరకాలమ్మ, శ్రీషిర్డీ సాయిరాం ఆలయాల్లో గేట్లు తాళాలను పగుల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీలు చోరీ చేశారు. ఈ రెండు ఆలయాల్లో పది వేలకు పైగా ఉండవచ్చని గ్రామస్థులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

లోకేశ్ ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

మహారాణిపేట, ఆగస్టు 30: విశాఖలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలనుంచి విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రేమించాలంటూ వెంట పడిన ఉన్మాది చేతిలో కుమార్తెను కోల్పోయిన తమ కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అనకాపల్లి జిల్లా కొప్పగుండుపాలెంకు చెందిన బుద్ధి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న తన కుమారుడిని అక్కడ పోలీసులు అరెస్టు చేశారని, ఏం జరిగిందో ఇంతవరకు సమాచారం లేదని విశాఖకు చెందిన ఎ. అప్పలకొండ మంత్రి లోకేశ్‌ను కలసి కన్నీటిపర్యంతమయ్యారు. వారసత్వంగా సంక్రమించిన భూమిని కబ్జా చేయటంతో పాటు కొందరు చంపుతామని బెదిరిస్తున్నారని, ఈ స్థితిలో తమకు రక్షణ కల్పించాలని అనకాపల్లి జిల్లా బంగారయ్యపేటకు చెందిన మాతిరెడ్డి రాజునాయుడు వేడుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ నాటక రంగం విభాగంలో అతిథి అధ్యాపకుడిని నియమించాలని, కంప్యూటర్ సైన్స్ చదివానని, తనకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే, బంగారు భూమి డెవలపర్స్ నుంచి ఇళ్లు, స్థలాలను కొనుగోలు చేయగా, వైసీపీ నేతలు వాటిని ఆక్రమించి వేధిస్తున్నట్టు పలువురు బాధితులు తెలిపారు. రాష్ట్ర సిలబస్‌లో చదువుతున్న పాఠశాలల విద్యార్థులకు 9 10 తరగతుల్లో సీబీఎస్‌సీ హిందీ పాఠ్య పుస్తకాలు కాకుండా పాత పాఠ్యాంశాలనే కొనసాగించాలని నర్సీపట్నంకు చెందిన హిందీ ప్రచార సమితి సభ్యులు కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని కొనసాగించాలని దళిత ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

సీఐల కుర్చీలు ఖాళీ

- రెండు నెలల క్రితం వీఆర్‌లో పట్టణ సీఐ కాంతికుమార్
- రూరల్ సీఐ హరి బదిలీ.. ఇన్‌చార్జులను నియమించని వైనం

నర్సీపట్నం, ఆగస్టు 30: నర్సీపట్నం పట్టణ, గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు కుర్చీలు ఖాళీ అయిపోయాయి. సభాపతి ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నంలో శుక్రవారం ఇన్‌చార్జ్ సీఐలు లేకుండానే శాంతిభద్రతల పర్యవేక్షణ నిర్వహించారు. గతంలో ఇక్కడ పని చేసిన పట్టణ సీఐ కాంతికుమార్‌ను రెండు నెలల క్రితం డీఐజీ వీఆర్‌లో పెట్టారు. ఇంతవరకూ ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. టౌన్ స్టేషన్‌లో ఇద్దరు ఎస్సైలు సుధాకర్, ఉమామహేశ్వరావు విధులు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం రూరల్ సీఐ హరి మన్యం జిల్లా పార్వతీపురానికి బదిలీ అయ్యారు. ఆయన రెండు నెలలుగా పట్టణ సీఐగా కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. శుక్రవారం ఆయన రిలీవ్ అయ్యారు. దీంతో పట్టణ, గ్రామీణ సీఐ కుర్చీలు ఖాళీ అయిపోయాయి. ఇటీవల రూరల్ ఎస్సై భీమరాజును నాతవరం బదిలీ చేశారు. రూరల్ స్టేషన్ నుంచి ఆయన ఇంకా రిలీవ్ కాలేదు. స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం వంటి ప్రాధాన్యం ఉన్న చోట ఇద్దరు సీఐలు లేకుండా శాంతిభద్రతల నిర్వహణ చేయడం అనేది ఇదే మొదటిసారి అని పట్టణ వాసులు మాట్లాడుకుంటున్నారు. కనీసం ఇన్‌చార్జ్ సీఐలను కూడా నియమించక పోవడం గమనార్హం.

కాగా, శనివారం ధర్మసాగరంలో నిర్వహించే పింఛన్ల పంపిణీలో సభాపతి అయ్యన్నపాత్రుడు హాజరవుతున్న నేపథ్యంలో బందోబస్తు బాధ్యతలు గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన గణేశ్‌కు అప్పగించినట్టు భోగట్టా.

జిల్లా అదనపు ఎస్పీగా మోహనరావు నియామకం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: జిల్లా అడిషినల్ ఎస్పీ (క్రైమ్)గా ఎల్.మోహనరావు నియమితులయ్యారు. మోహనరావు రాజమహేంద్రవరం డీఎస్ఆర్‌పీ నుంచి ఇక్కడికి వస్తున్నారు. ఇంతవరకు పనిచేసిన సత్యనారాయణరావు ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే.

తిరుపతి, సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 30: వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, తిరుపతి, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగించినట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583) సెప్టెంబరు రెండు నుంచి నవంబరు 25 వరకు (ప్రతి సోమవారం), తిరుగు ప్రయాణంలోని తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584) సెప్టెంబరు మూడు నుంచి నవంబరు 26వ తేదీ వరకు (ప్రతి మంగళవారం) అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, విశాఖ- సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (08579) సెప్టెంబరు నాలుగు నుంచి నవంబరు 27 వరకు (ప్రతి బుధవారం), తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్- విశాఖ ప్రత్యేక రైలు (08580) సెప్టెంబరు ఐదు నుంచి నవంబరు 28 వరకు (ప్రతి గురువారం) అందుబాటులో ఉంటాయని తెలిపారు.

విశాఖ, చెన్నై, ఎగ్మోర్ మధ్య ప్రత్యేక రైలు

పండగల సీజన్ దృష్ట్యా విశాఖ, చెన్నై ఎగ్మోర్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. 08557 నంబరు గల రైలు సెప్టెంబరు ఏడు నుంచి నవంబరు 30వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది. తిరిగి 08558 నంబరు గల రైలు సెప్టెంబరు ఎనిమిది నుంచి నవంబరు 31 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 10.35 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది.

అయ్యప్ప భక్తులకు విశాఖ, కొల్లాం మధ్య ప్రత్యేక రైలు

శబరిమలై భక్తుల సౌకర్యార్థం విశాఖ, కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం తెలిపారు. 08539 నంబరు గల రైలు సెప్టెంబరు నాలుగు నుంచి నవంబరు 27 వరకు ప్రతి బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మ ర్నాడు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరిగి 08540 నంబరు గల రైలు సెప్టెంబరు ఐదు నుంచి నవంబరు 28 వరకు ప్రతి గురువారం రాత్రి 7.45 గంటలకు కొ ల్లాంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుతుంది.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నందలూరు స్టేషన్‌లో హాల్ట్

ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ-తిరుపతి/ కడప మధ్య రాకపోకలు సాగిస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రయోగాత్మకంగా శుక్రవారం (30వ తేదీ) నుంచి నందలూరు స్టేషన్‌లో ఒక నిమిషంపాటు హాల్ట్ కల్పించామని సీనియర్ డీసీఎం తెలిపారు. దీంతో విశాఖ నుంచి తిరుపతి / కడప వెళ్లే 17488 నంబరు గల రైలు ఉదయం 6.14 గంటలకు, తిరుగు ప్ర యాణంలో కడప / తిరుపతి నుంచి విశాఖ వచ్చే 17487 నంబరు గల రైలు సాయంత్రం 6.09కు నందలూరు స్టేషన్‌లో ఆగుతుందని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటండి

- సంరక్షించే బాధ్యతలను సైతం తీసుకోండి
- వన మహోత్సవంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు


బెలూన్ ఎగురవేస్తున్న అయ్యన్న

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలను నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో శుక్రవారం సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యార్డు ఆవరణలో అయ్యన్నపాత్రుడుతో పాటు ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌లు మొక్కలు నాటి బెలూన్లు ఎగురవేశారు. అనంతరం అయ్యన్న మాట్లాడుతూ గతంలో తాను అటవీ శాఖా మంత్రిగా ఉన్న సమయంలో పాఠశాలల్లో రెడ్‌క్రాస్, గ్రీన్‌క్రాప్, ఎన్‌సీసీ వంటి విభాగాలతో ప్రత్యేకంగా ఒక రోజు లక్షల మొక్కలు నాటేలా చర్యలు తీసుకునేవారమన్నారు. ప్రస్తుతం వాటన్నింటినీ పటిష్టం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లాలో ఉన్న నాలుగు లక్షల మంది డ్వాక్రా మహిళలను మొక్కల పెంపకంలో భాగస్వామ్యం చేయాలన్నారు. శాస్త్రవేత్తలు వద్దని సూచించిన కొన్ని జాతుల మొక్కలను రోడ్డు మధ్య, డివైడర్లపై నాటవద్దన్నారు. అన్ని కళాశాలల్లో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లు వెడల్పు చేసినప్పుడు చెట్లు నరికితే వాటిని తిరిగి పెంచేందుకు ప్రత్యేకంగా రోడ్డు పని బడ్జెట్‌లోనే నిధుల కేటాయింపు జరిగేలా అనకాపల్లి జిల్లా నుంచే శ్రీకారం చుట్టాలని కోరారు. ప్రతి ఒక్క విద్యార్థి వారి ఇంటి పరిసర ప్రాంతాల్లో మూడు మొక్కలు నాటాలని సూచించారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 60 లక్షల మొక్కలు నాటామని, భవిష్యత్తులో విరివిగా మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మొక్కలు పెంపకం అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్, అటవీశాఖ అధికారులు, జిల్లా అధికారులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

- క్రీడల వల్లే తనకు ఎమ్మెల్యే ఛాన్స్
- పోటీల ప్రారంభోత్సవంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: పట్టణంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం రాష్ట్రస్థాయి 11వ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను తొలుత శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు క్రీడలంటే ఇష్టమన్నారు. తాను 1983లో వాలీబాల్ క్రీడలో ఉండగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు క్రీడా కోటాలో ఎమ్మెల్యే ఛాన్సు కల్పించారన్నారు. పలు ప్రభుత్వ శాఖల్లో స్పోర్ట్స్ కోటా ఉన్నందున ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాల్సిందిగా కోరారు. ప్రభుత్వం నుంచి క్రీడల ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ క్రీడల్లో అనకాపల్లికి మంచి గుర్తింపు ఉందన్నారు. ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్‌లో అనకాపల్లి క్రీడాకారులు విజయకేతనం ఎగురవేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలరావు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీపీ బాబురెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్మాల వెంకటరామలతో పాటు పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏ కంపెనీ నుంచి ఒక్క రూపాయి తీసుకోలేదు

- నిరూపిస్తే దేనికైనా సిద్ధం
- కొన్ని కర్మాగారాలకు నా తీరు కష్టంగా ఉంది
- అవాస్తవాలు రాసి విలేకరులు అభాసుపాలు వద్దు : ఎమ్మెల్యే 'సుందరపు'


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, ఆగస్టు 30: ఆధారాలు లేని వార్తలు రాసి విలేకరులు అభాసుపాలు కావద్దని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ హితవు పలికారు. శుక్రవారం ఇక్కడి జనసేన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పదహారు సంవత్సరాలు కఠోరమైన దీక్ష చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. కర్మాగారాలను విజయకుమార్ దోచుకుంటున్నారని కొన్ని పత్రికలు అవాస్తవ కథనాలు రాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కంపెనీ నుంచైనా ఒక్క రూపాయి తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా తాను సిద్ధమని స్పష్టం చేశారు. కొన్ని కర్మాగారాలకు విజయకుమార్ తీరు కష్టంగా ఉందన్నారు. ఎందుకంటే మొక్కలు పెంచండి, సేఫ్టీ పాటించండి, స్థానికులకు ఉద్యోగాలివ్వండి , ప్రమాదాలు జరగకుండా చూడండి అంటూ.. ఒత్తిడి తెస్తుండడం వల్ల కొన్ని కర్మాగారాల యాజమాన్యాలు తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని సుందరపు పేర్కొన్నారు. కొన్ని పత్రికలు ఎవరి ప్రాపకానికో తప్పుడు వార్తలు రాస్తున్నాయన్నారు. అలా రాసిన విలేకర్లు భవిష్యత్తులో ఇబ్బందులు పడతారన్నారు. నిజాలు ఉంటే నిర్భయంగా రాయాలని స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికిందెవరో తేలేదెలా?

- నర్సీపట్నం, కృష్ణాదేవిపేట రేంజర్లు తలోమాట
- మా పరిధి కాదంటే.. మాది కాదంటూ నిర్లక్ష్యం
- అక్రమంగా నరికిన టేకు చెట్లు ఏ బీట్ పరిధిలోకి వస్తాయో తేలని వైనం
- సీసీఎఫ్‌కి ఫిర్యాదు చేసినా విచారణ నాన్చుడు ధోరణి


టేకు చెట్టు మాను

నర్సీపట్నం, ఆగస్టు 30: టేకు చెట్లు అక్రమంగా నరికింది మా పరిధి కాదంటే.... మా పరిధి కాదని నర్సీపట్నం, కృష్ణాదేవిపేట రేంజర్లు తలో మాట మాట్లాడుతున్నారు. నాతవరం సెక్షన్ పరిధిలోని వెదురుపల్లి, కృష్ణాపురం, అచ్చంపేట, సుందరకోట అటవీ ప్రాంతంలో ఈ నెల మొదటి వారంలో అటవీ సిబ్బంది సహకారంతో వంద టేకు చెట్లు అక్రమంగా నరికి వేశారని నాతవరం మండలం గుణిపూడికి చెందిన మరిడయ్య సీసీఎఫ్‌కి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. నర్సీపట్నం రేంజ్ అధికారి లక్ష్మీనర్సు రెండు రోజులు పాటు టేకు ప్లాంటేషన్లు తనిఖీ చేసి తమ పరిధిలో చెట్లు నరకలేదని తేల్చేశారు. నరికిన మూడు టేకు చెట్లు సుందరకోట సమీపంలో కృష్ణాదేవిపేట రేంజ్ పరిధి బంగారయ్య బీట్ లోనివని ఆయన తేల్చారు. జీపీఎస్ నేవిగేషన్‌లో చూపించిన 1251 కంపార్ట్‌మెంట్ తమ (బంగారయ్యపేట బీట్) పరిధిలోకి రాదని నర్సీపట్నం రేంజ్, వెదురుపల్లి బీట్ అని కృష్ణాదేవిపేట రేంజ్ అధికారి వెంకట్రావు అన్నారు.

టేకు చెట్లు నరికింది ఏ బీట్‌లోనివి అన్నది పక్కన పెట్టి అధికారుల నిర్లక్ష్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అటవీ ప్రాంతంలో టేకు చెట్లు నరికి అక్రమంగా తరలించి 25 రోజులు కావస్తున్నా అటవీ ఉన్నతాధికారులు నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏపీ స్కూల్స్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం

- అందరూ సహకరించాలి
- గత ప్రభుత్వంలో మాదిరిగా వేధింపులు ఉండవు
- మీ సమస్యలు తీర్చే బాధ్యత మాది
- భీమిలి కేజీబీవీ సందర్శనలో మంత్రి నారా లోకేశ్
- విద్యాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నాం


మంత్రి లోకేశ్‌కు మొక్కను బహూకరిస్తున్న కేజీబీవీ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

భీమునిపట్నం, ఆగస్టు 30:

"దేశంలో ఏపీ స్కూల్స్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడానికి మీ అందరి సహకారం ఎంతో అవసరం. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎవరిపైనా వేధింపులుండవు, మీ సమస్యలన్నీ తీర్చే బాధ్యత మాది."...

- భీమిలి కస్తూర్బాగాంధీ విద్యాలయం తనిఖీ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్

మంత్రి శుక్రవారం ఉదయం విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తొమ్మిది, పది తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరిగి వెళుతుండగా సిబ్బంది అంతా 'థాంక్యూ సార్...' అని కోరస్‌గా చెప్పడంతో ఆగారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి పది లక్షల మంది విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారన్నారు. తాము అధికారంలోకి వచ్చి వంద రోజులు కూడా కాలేదని, అన్నీ తెలుసుకుంటున్నాం, నేర్చుకుంటున్నామని, త్వరలో విద్యాభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించి అందరికీ పంపిస్తామన్నారు. ఒకేసారి అంతా ఇంగ్లీష్ చేసేస్తున్నామంటే పిల్లలు ఇబ్బంది పడతారన్నారు. ఇంగ్లీష్ లాంగ్వేజిని క్రమేణా చేర్చుతామన్నారు. వచ్చే ఐదేళ్లలో విద్యాపరంగా ఎంతో అభివృద్ధి సాధించాలని ధ్యేయంగా పెట్టుకున్నామని, అందరూ బాధ్యతగా పనిచేసి సహకరించాలని కోరారు. 'స్కూల్ మెయింటెనెన్స్ ఎప్పుడూ ఇట్టానే చేయండి. ఈసారి అధికారులకు చెప్పి వచ్చాను. నేను వస్తున్నానని బాగా చేసి ఉండొచ్చు. నెక్స్ట్ టైమ్ ఎవరికీ చెప్పకుండా సడన్‌గా నేనొక్కడినే వస్తాను, ఈ విషయాన్ని కారులో మా అధికారులకు కూడా చెప్పా...' అని అన్నారు. దాంతో అందరూ వెల్‌కమ్ సార్ అని అన్నారు. ఈ దశలో సిబ్బంది చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామనగా, డిఫరెంట్ పీపుల్, డిఫరెంట్ ప్రాబ్లమ్స్...అన్నీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌ను చిప్పాడ దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్ కలిసారు. తమ కంపెనీ కేజీబీవీకి సీఎస్ఆర్‌లో చేస్తున్న సహకారాన్ని వివరించారు. ఓకే గుడ్ అంటూ, తర్వాత మరోసారి మాట్లాడదామని మంత్రి అన్నారు.

ఒక రోజు ముందే..

- నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ
- ఉదయం ఆరు గంటలకే ప్రారంభం
- జిల్లాకు రూ.108.12 కోట్లు విడుదల

అనకాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు ఒక రోజు ముందుగానే పంపిణీ చేయనున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో కూటమి ప్రభుత్వం పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా శనివారమే పింఛన్ సొమ్ము అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పింఛన్‌ల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 2,61,800 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.108.12 కోట్లు విడుదల చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ) అధికారులు సంబంధిత బ్యాంకులకు నిధులు జమ చేశారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది ఆయా బ్యాంకుల నుంచి శుక్రవారం నగదు డ్రా చేశారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్‌లు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇళ్ల వద్ద అందుబాటులో ఉన్న పింఛన్‌దారులందరికీ సాయంత్రంలోగా నగదు అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ శశీదేవి తెలిపారు.

సమర్థంగా పింఛన్లు పంపిణీ: స్పీకర్ అయ్యన్న

నర్సీపట్నం, ఆగస్టు 30: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు అధికారులతో సమన్వయం చేసుకొని పింఛన్లు పంపిణీని విజయవంతం చేయాలని సూచించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి అనిత వ్రతం


అమ్మవారికి పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 30: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ హోం మంత్రి వంగలపూడి అనిత శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని అంత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నక్కపల్లికి సమీపంలో ఉన్న తన నివాస గృహం వద్ద జరిగిన ఈ వేడుకను సింహాచలం నుంచి వచ్చిన వేద పండితులు మంథా కల్యాణ్ శర్మ జరిపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పార్శిల్ కార్యాలయాల్లో పోలీస్ జాగిలాలతో తనిఖీలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: గంజాయి రవాణా నివారణ చర్యల్లో భాగంగా జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పరవాడ ప్రాంతాల్లో పోలీసులు పార్శిల్ సర్వీస్ కార్యాలయాల వద్ద శుక్రవారం జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. పీటీడీ, రైల్వే స్టేషన్, ప్రైవేటు పార్శిల్ సర్వీసుల వద్ద గంజాయి, ఇతర మత్తుపదార్థాలను వాసనను గ్రహించి పసికట్టే పోలీస్ జాగిలాల ద్వారా పటిష్టమైన తనిఖీలు నిర్వహించామని జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. యువత అక్రమ సంపాదనకు ఆశపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి సేవించేవారు మానసికంగా, శారీరకంగా దుష్పరిణామాలకు గురవుతారని ఎస్పీ పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడే వారికి 10 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాలు శిక్షపడే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా యువత, ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ తనిఖీల్లో అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పరవాడ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాండవ డ్యామ్ మెయిన్‌గేటు షట్టర్‌కు మరమ్మతు


తాండవ డ్యామ్ మెయిన్‌గేటు షట్టర్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం

నాతవరం, ఆగస్టు 30: తాండవ డ్యామ్ మెయిన్‌గేటు ఒక్క షట్టర్ ఇనుప రోప్ తెగిపోవడంతో అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టి తాండవగేటు తెరచుకునేలా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి విస్తారంగా వర్షాలు పడడంతో తాండవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. తాండవ గరిష్ఠ నీటి మట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 377.7 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. అలాగే ఇన్‌ఫ్లోద్వారా తాండవలోకి 485 క్యూసెక్కుల నీరు వస్తోంది. తాండవ కుడి ఎడమ కాలువలకు 485 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై మంత్రి లోకేశ్‌కు వినతి

నర్సీపట్నం, ఆగస్టు 30: రాష్ట్రంలో 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను పీఆర్టీయూ విశాఖ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డీజీ నాథ్ కోరారు. గురువారం విశాఖపట్నం వచ్చిన మంత్రిని కలిసిన డీజీనాథ్ జీవో నెంబరు 117 రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలను బదిలీ చేయాని, మునిసిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి జీవో 84ని రద్దు చేయాలని కోరారు. కేజీబీవీలలో వార్డెన్ పోస్టులు ఖాళీలను భర్తీ చేయాలని వినతిపత్రం సమర్పించారు. అలాగే ఏపీ సీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు గాడి సూర్య ప్రకాశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ని విశాఖపట్నంలో కలిశారు. ఈ సందర్భంగా సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులు ఉపసంహరించాలని కోరారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ

▸▸ 'వనం- మనం'లో భాగంగా మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు


కశింకోట మండలం ఉగ్గినపాలెంలో మొక్క నాటుతున్న ప్రత్యేకాధికారిణి రోజారాణి


ఎలమంచిలిలో పాఠశాలలో మొక్క నాటుతున్న మునిసిపల్ వైస్ చైర్మన్లు

కశింకోట, ఆగస్టు 30 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారిణి ఎం. రోజారాణి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉగ్గినపాలెం, జమ్మాదులపాలెంలలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. ఎంపీడీవో ఎ.రవికుమార్, ఏపీవో శివ, సాంకేతిక సహాయకులు కుమారి, శివాని, సత్యనారాయణ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : ఇక్కడి కేజీబీవీలో ఎస్వో సలీమా ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో కె.నరేశ్ టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్‌లు విద్యాలయం పరిసరాల్లో పలు రకాల మొక్కలు నాటి మాట్లాడారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్, సర్పంచ్ నేతల జయరత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, గింజాల లక్ష్మణరావు, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో రమేశ్ నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక గురుకుల విద్యాలయం ఆవరణలో వనం- మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. ఎంఈవోలు లక్ష్మణరావు, బీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలి : మునిసిపాలిటీలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల మొక్కలు నాటారు. మునిసిపల్ డీఈ వీరయ్య వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను తదితరులు ఇక్కడి సెయింట్ జూడ్స్ స్కూల్ సమీపంలో మొక్కలు నాటారు. ముందుగా మొక్కల ప్రాధాన్యాన్ని వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అటవీశాఖ అధికారులు, కళాశాల యాజమాన్యం మొక్కలు నాటారు. మునిసిపల్ ఏఈ వెంకట్రావు, అటవీ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లి కేజీబీవీలో...



సబ్బవరం గురుకుల విద్యాలయంలో...

జిల్లాలో దోమల నియంత్రణకు చర్యలు

▸▸ పీహెచ్‌సీలకు లక్ష గంబూషియా చేప పిల్లలు పంపిణీ

▸▸ చెరువులు, నీటి కుంటల్లో విడిచిపెట్టిన వైద్య సిబ్బంది


తుమ్మపాల కోనం చెరువులో చేపల పిల్లలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ తదితరులు


పాయకరావుపేటలోని మురుగు నీటిలో చేపలు విడుదల

తుమ్మపాల, ఆగస్టు 30 : జిల్లాలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్టు డీఎంహెచ్‌వో బాలాజీ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పీహెచ్‌సీలకు లక్ష గంబూషియా చేప పిల్లలను పంపిణీ చేశారు. తుమ్మపాల కోనం చెరువులో చేపపిల్లలు విడిచిపెట్టి మాట్లాడారు. గంబూషియా చేప పిల్లలను చెరువులు, నీటి కుంటలు, నీటి నిల్వలలో విడిచిపెడుతున్నామన్నారు. విషపూరితమైన దోమల ద్వారా వ్యాప్తిచెందే లార్వాను ఈ చేపలు తింటాయన్నారు. తద్వారా దోమల వ్యాప్తిని అరికట్ట వచ్చునని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి నజరత్ షమీమ్, డీఎంవో ఎ.వరహాలదొర, వైద్యసిబ్బందితో పాటు నాయకులు పీలా విశ్వేశ్వరరావు, తాతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట, ఆగస్టు 30 : దోమల నియంత్రణే లక్ష్యంగా పలు మండలాల్లో అధికారులు శుక్రవారం గంబూషియా చేపలను విడుదల చేశారు. ఇందులో భాగంగా పాయకరావుపేట పీహెచ్‌సీ సిబ్బంది పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని ఇళ్ల మధ్య ఉన్న మురికినీటి చెరువులు, గుంతలు, నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో ఈ చేపలను విడిచిపెట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్, ఎంపీఈవో రమణ, హెచ్ఎస్ నాగేశ్వరరావు, విజయకుమారి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లోని నీటి నిల్వలు ఉన్న చోట్ల గంబూషియా చేపలను విడుదల చేశారు. అనంతరం ఇళ్ల వద్ద నీటి నిల్వల వల్ల తలెత్తే అనర్థాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రెండు పీహెచ్‌సీల వైద్య సిబ్బంది టి.నాగేశ్వరరావు, ఎస్ఎస్‌వీ ప్రకాష్, డాక్టర్ పీఎస్‌వీఎస్ ప్రసాద్, శ్రీనివాస్, ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.


మునగపాక సంతబయలు చెరువులో...

కశింకోట : తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలోని నర్సింగబిల్లి, జట్టపురెడ్డితుని, చింతలపాలెం, ఇ. చౌడువాడ, తాళ్లపాలెం గ్రామాల్లో ఉన్న చెరువుల్లో వైద్య సిబ్బంది గంబూషియా చేపలను విడుల చేశారు. పీహెచ్‌సీ ప్రదాన వైద్యాధికారి డాక్టర్ యు.రమేష్, ఆరోగ్య విస్తరణాధికారి వి.ఎ.సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: హరిపాలెం పీహెచ్‌సీ పరిధి కొండకర్ల చెరువులో వైద్య సిబ్బంది గంబూషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వసంత కుమార్ మాట్లాడుతూ దోమల నివారణకు ఉన్నతాధికారులు ఈ చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్ పాల్గొన్నారు.

రాంబిల్లి : ఇక్కడి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో గోవిందపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లోని చెరువులు, నీటి కుంటలలో గంబూషియా చేపలను విడుదల చేశారు. ఎంపీహెచ్ఈవో ఎస్ఆర్ఎన్ స్వామి, హెల్త్ సూపర్‌వైజర్ కేఎస్ఎన్ మూర్తి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాకలోని సంతబయలు చెరువులో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ విమల గంబూషియా చేపలను విడుదల చేశారు. దోమల నివారణకు ఉన్నతాధికారులు ఈ చర్యలు చేపట్టినట్టు చెప్పారు. సీహెచ్‌వో దేవకాంత, హెల్త్ సూపర్‌వైజర్ మళ్ల నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ జగన్నాథరావు, జ్యోతిలాల్, సంతోషి పాల్గొన్నారు.

పాడి పశువుల్లో వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

▸▸ జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రసాదరావు

ఎలమంచిలి, ఆగస్టు 30 : పాడి పశువుల్లో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు సూచించారు. మండలంలోని లక్కవరంలో శుక్రవారం ఏర్పాటైన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పలు పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించడంతో పాటు నట్టల నివారణ, గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి రామ్మోహన్‌రావు, ఎలమంచిలి ఏడీ గంగాధరరావు, ఏటికొప్పాక పశు వైద్యాధికారి దేవరాజు, భానుబాబు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజించండి : పీలా


ప్రచారంలో పీలా గోవింద, తాతయ్యబాబు తదితరులు

కొత్తూరు, ఆగస్టు 30 : మట్టి గణపతినే అంతా పూజించి.. పర్యావరణాన్ని పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. సెప్టెంబరు ఏడో తేదీన జరగనున్న వినాయక చవితికి అందరూ మట్టి గణపతిని పూజించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, గౌరీసేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధ శివాజీ, నిమజ్జన కమిటీ అధ్యక్షుడు ఆడారి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు మళ్ల సురేంద్ర, పి.సోమశేఖర్, దాడి బుజ్జి, పోలారపు త్రినాద్, ఆకుల నానాజీ, పి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో అక్రమ క్వారీలపై విచారణ

తుమ్మపాల, ఆగస్టు 30 : మార్టూరులో నిర్వహిస్తున్న అక్రమ క్వారీలపై విచారణ చేపడుతున్నట్టు మైన్స్ ఆర్ఐ స్వాతి తెలిపారు. శుక్రవారం మార్టూరు రెవెన్యూ పరిధి సర్వే నంబరు ఒకటిలో గల క్వారీలను మైన్స్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు అందించిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్టు చెప్పారు.

'ఎసెన్షియా' మృతులకు కొవ్వొత్తులతో నివాళి

అచ్యుతాపురం, ఆగస్టు 30 : సెజ్‌లో 17 మంది కార్మికుల ప్రాణాలను బలిగొన్న ఎసెన్షియా యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. శుక్రవారం మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ అచ్యుతాపురం జంక్షన్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగి కార్మికులు మృతి చెందిన తర్వాత పరిహారం ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. వేలాది మంది కార్మికులు పనిచేస్తున్న అచ్యుతాపురం ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.సోమునాయుడు, రమణ, చండీ, రామనాయుడు, నరసింహారావు, నానాజీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఫార్మా పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి'

పరవాడ, ఆగస్టు 30 : విశాఖ ఫార్మాసిటీ, అచ్యుతాపురం సెజ్‌లో గల ఫార్మా పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. ఎసెన్షియా ఫార్మా కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయినా యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. అలాగే ముగ్గురు కార్మికుల మృతికి కారణమైన సినర్జిన్ యాజమాన్యానికి రాయితీ కల్పించడం దారుణమని వాపోయారు.

ఆలయాల్లో శ్రావణ లక్ష్మీ పూజలు


కనకదుర్గమ్మ అలంకరణలో సంతోషిమాత

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30 : శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలోని మండపంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. గవరపాలెం సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని విజయవాడ కనకదుర్గాదేవిగా అలంకరించారు. వివిధ పార్టీల నాయకులు, భక్తులు దర్శించుకున్నారు. గౌరీ పంచాయతన ఆలయం, కన్యకాపరమేశ్వరి, సర్వకామదాంబ ఆలయాల్లోనూ ఈ పూజలు వైభవో పేతంగా జరిగాయి.

భక్తిశ్రద్ధలతో గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30 : ఇక్కడి గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి వేదమంత్రాల నడుమ చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం గణేష్ తదితరులు ఏర్పాట్లు చేపట్టారు.

ఘనంగా సామూహిక కుంకుమార్చనలు

సబ్బవరం, ఆగస్టు 30 : మండల కేంద్రం సబ్బవరంలో గల దుర్గమాంబ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. దేవీపురంలో రాజరాజేశ్వరీ సహిత సహస్రాక్షి అమ్మవారి ఆలయంలో గురుపత్ని అన్నపూర్ణమ్మ గోపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. మహాలక్ష్మీ అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. కందర్ప ప్రభాకర్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వినాయక పందిళ్లకు అనుమతులు తప్పనిసరి


సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30 : వినాయక చవితి సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో పందిళ్లు, మండపాలు వేయాలనుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సింగిల్‌విండో యాప్ ద్వారా అనుమతులు పొందాలన్నారు. మండపాల నిర్మాణం, విద్యుత్ అలంకరణలు, మైక్ పర్మిషన్‌లకు జీవీఎంసీ, ఈపీడీసీఎల్, పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరిగా పేర్కొన్నారు.

ఎలమంచిలి సీఐ ధనుంజయరావు బాధ్యతలు


ధనుంజయరావు

ఎలమంచిలి, ఆగస్టు 30 : ఇక్కడి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.ధనుంజయరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి రూరల్ నంచి బదిలీపై ఆయన ఇక్కడికి విచ్చేశారు. ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న ఎస్‌కే గఫూర్ విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ కార్మికులు ధర్నా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30 : పీటీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనకాపల్లి డిపో ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డ్రైవర్లు, కండక్టర్లకు నైట్‌ఔట్ అలవెన్సులను పునరుద్ధరించాలని, జీవో నంబరు 114 లోని అలవెన్సులను అమలు చేయాలని, రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల బకాయిలు చెల్లించాలని, సర్వీసులో ఉన్న ఉద్యోగుల వేతన బకాయిలు, ఎరియర్స్ చెల్లించాలని వంటి పది డిమాండ్లతో ఈ ఆందోళన చేపట్టారు. యూనియన్ నాయకులు ఏఎస్ రావు, పీఎస్‌వీపీ రావు, ఎల్‌వీఆర్ బాబు, వేపాడ శ్రీను, ఎం.రాంబాబు, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నానో టెక్నాలజీతో భవిష్యత్తులో సత్ఫలితాలు'

ఎలమంచిలి, ఆగస్టు 30 : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జాతీయ వెబ్‌నార్ నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన నానోస్పేస్ కంపెనీ కో-ఫౌండర్ డాక్టర్ జి.వెంకటరమణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నానో టెక్నాలజీపై అవగాహ కల్పించారు. రాబోయే రోజుల్లో ప్రపంచానికి నానో మెటీరియల్స్ వలన ఎన్నో సత్ఫలితాలు ఉన్నాయన్నారు. తెలుగు రాష్ట్రాలలో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు ఎ.ఎస్.జగ్గారావు, కె.వెంకన్న, సాయిచరణ్, ఎస్.పి. దేవిలతో పాటు స్థానిక కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ములకలాపల్లిలో రక్తదాన శిబిరం

ఎలమంచిలి, ఆగస్టు 30 : మండలంలోని ములకలాపల్లిలో మైహోమ్ సిమెంటు పరిశ్రమ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరిశ్రమ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వీహెచ్.చౌదరి ప్రారంభించారు. మైహోమ్ గ్రూపు కార్పొరేట్ సేఫ్టీ హెడ్ విజయ్‌కుమార్, బి.రామస్వామి, సీనియర్ డీజీఎం ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న మత్స్యకార నేతలు

నక్కపల్లి, ఆగస్టు 30 : మండలంలోని ఎనిమిది మత్స్యకార గ్రామాల్లో చేపల వేటపై ఆధారపడిన మత్స్యకారుల వలసలను నివారించేందుకు త్వరితగతిన జెట్టీని ఏర్పాటు చేయాలని మత్స్యకార సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్‌లను అనకాపల్లిలో కలిసి వినతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజయ్యపేట శివారు బోయపాడు గ్రామంలో జెట్టీ నిర్మాణానికి సుమారు 6.5 ఎకరాల స్థలాన్ని కూడా ఎంపిక చేశారని వివరించారు. ఇక్కడ జెట్టీ నిర్మాణం పూర్తయితే మండలంలోని మత్స్యకారులకు మేలు జరుగుతుందన్నారు. నాయకులు మాతా గుర్నాథరావు, వాసిపల్లి నూకరాజు, పిక్కి రాంబాబు, గరికిన సింహాద్రి, కొవిరి వెంకటేశ్, పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు, పిక్కిదేవుడు, నూకరాజు, వాసుపల్లి శివ, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : ఎన్ఏవోబీ ప్రాజెక్టు ఏర్పాటుతో నష్టపోతున్న వాడనర్సాపురం, కొత్తపట్నం మత్స్యకారులను ఆదుకోవాలని శుక్రవారం సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సూరాడ అప్పలరాజు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి చోడిపల్లి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పెద్దలు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఏవోబీ ప్రాజెక్టు ఏర్పాటుతో సముద్రములో చేపటవేకు దూరమైపోయామని వాపోయారు.

జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన ఏర్పాట్లపై సమీక్ష

అచ్యుతాపురం, ఆగస్టు 30 : పర్యావరణ పరిరక్షణపై ప్రజలంతా ప్రత్యేక దృష్టి సారించి, రేపటి తరానికి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శుక్రవారం ఇక్కడి జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబరు రెండున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా కూటమి నాయకులంతా ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అనకాపల్లి- అచ్యుతాపురం, గాజువాక- ఎలమంచి వయా అచ్యుతాపురం రోడ్ల విస్తరణ పనులు జరగనున్నాయని, ఈ తరుణంలో రోడ్ల పక్కనున్న చెట్లను కాపాడుతూ రోడ్డు వేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించినట్టు చెప్పారు. పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని వివరించారు. నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, భైలపూడి శ్రీరామదాసు, ఆడారి మంజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. పవన్ జన్మదినం రెండో తేదీన జరగనున్న నేపథ్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు టెక్కలి పరుశురాం, నాయకులు చంద్రమోహన్, పాలిపిని రాము, మొల్లేటి ఆనంద్, వైస్ ఎంపీపీ చిందాడ దేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల నేపథ్యంలో జనసేన ముఖ్యనేతలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన ముఖ్య నేతలు పాల్గొని ఆయా కార్యక్రమాలపై చర్చించారు. అనకాపల్లి మండలం, కశింకోట మండలంలో ఈ వేడుకలను పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు.

అధికారంలో ఉన్నాం... అణిగిమణిగి ఉండండి

... 5వ పేజీ తరువాయి

జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నీతివంతమైన పాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని, అందుకు తగిన విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలతో కలిసి పనిచేయాలన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని, దీనికి అనుగుణంగా అక్టోబరు నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని లోకేశ్ తెలిపారు. ప్రతి ఎమ్మెల్యే/ఇన్‌చార్జి తమ పరిధిలో సభ్యత్వ నమోదు పక్కాగా చేపట్టాలని సూచించారు. గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. నామినేటెడ్ పదవులపై ఇప్పటికే కసరత్తు జరిగిందని, కష్టపడే వారికి పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. మరోసారి విశాఖ వచ్చినప్పుడు విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటుచేసి, అన్ని విషయాలపై చర్చిస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బదిలీల్లో ముఖ్యమంత్రి పక్కాగా ఉంటూ సమర్థులకు పోస్టింగ్స్ ఇస్తున్నారన్నారు. అదే ఒరవడి కొనసాగించాలని నిర్ణయించారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బాగా పనిచేస్తూ అందరినీ సమన్వయం చేసుకుంటున్నారని అభినందించారు.

ఈ సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేసి భారీ ఎత్తున అవినీతికి పాల్పడిన అధికారి విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా వచ్చేందుకు యత్నిస్తున్నారని, ఇందుకు ఒకరిద్దరు సిఫారసు లేఖలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ అవినీతికి పాల్పడే అధికారిని విశాఖ జడ్పీ సీఈవో పోస్టులో నియమించబోమని హామీ ఇచ్చారు. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో సమస్యలపై మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు నియోజవర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, కిడారి శ్రావణ్‌కుమార్, నాయకులు గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర, ప్రగడ నాగేశ్వరరావు, బుద్దా నాగజగదీష్, చింతకాయల విజయ్, దాడి రత్నాకర్, కోరాడ రాజబాబు, పైలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

... 5వ పేజీ తరువాయి

డెంగ్యూ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన చల్ల నాగరాజు జర్వంతో బాధపడుతూ గత మంగళవారం వైద్యం కోసం పీహెచ్‌సీకి రావడంతో.. డాక్టర్ వెంకటకృష్ణ రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి పంపారు. ఇతను డెంగ్యూబారిన పడినట్టు శుక్రవారం రిపోర్టు వచ్చింది.

అదుపులో మలేరియా జ్వరాలు

జిల్లాలో మలేరియా జ్వరాలు అదుపులోనే ఉన్నాయి. వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలో అక్కడక్కడా వైరల్ జ్వరాలు ప్రబలిన మాట వాస్తవమే. వైరల్ జ్వరాలు ప్రబలినట్టు సమాచారం వచ్చిన వెంటనే ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలందరి నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నాం. మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరం మేరకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందిస్తున్నాం. దోమల ఉత్పత్తిని నిరోధించడానికి డ్రైనేజీ కాలవలు, నీటి కుంటల్లో గంబూషియా చేపలను వదులుతున్నాం.

- వరహాలు దొర,
జిల్లా మలేరియా అధికారి, అనకాపల్లి

ఎట్టకేలకు సాకారం

... 5వ పేజీ తరువాయి

ఎనిమిదిచోట్ల ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయంటూ ఆయా ప్రాంతాల పేర్లు చెప్పుకొచ్చారు. వాటిల్లో రెండో పేరు పూడిమడక హార్బర్. అచ్యుతాపురం మండలవాసులు కాకుండా మిగిలిన ప్రాంతాల వారు ఇదే నిజమేనని నమ్మేట్టుగా ఉన్నాయి ఆయన మాటలు. కానీ పూడిమడక- సీతపాలెం రోడ్డు నుంచి ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదిత ప్రదేశం వరకు చదును చేసి తాత్కాలికంగా మట్టి రోడ్డు వేయడం మినహా మిగిలిన పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలో మే నెలలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో ఫిషింగ్ హార్బర్‌కు మళ్లీ కదలిక వచ్చింది. శుక్రవారం సాయంత్రం ప్రధాని నరేంద్రమోదీ మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని ఏడాదిన్నర కాలంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.


నర్సీపట్నం : మొక్క నాటి నీరు పోస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి


బుచ్చెయ్యపేట : మొక్క నాటుతున్న ఎంపీడీవో సువర్ణరాజు


రావికమతం : జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు



రోలుగుంట : కుసర్లపూడిలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు


కాశీపురంలో మొక్కలు నాటుతున్న ఎంఈవో ఉషారాణి

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

» వన మహోత్సవంలో వక్తలు » పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు, టీచర్లు, విద్యార్థులు

నర్సీపట్నం, ఆగస్టు 30 : అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రేంజ్ అధికారి లక్ష్మీనర్సు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మొక్క నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, అద్దేపల్లి గణేశ్, అటవీ అధికారులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : నాటిన మొక్కలను సంరక్షించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఎంపీడీవో సువర్ణరాజు పేర్కొన్నారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా ఐతంపూడిలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించినప్పుడే సామాజిక నిర్వర్తించినట్టవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, ఏపీవో మురళి తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : వనమహోత్సవంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి పీవీ రవి వర్మ, తహసీల్దార్ మహేశ్వరావు, డీఆర్వో రాజగోపాలరావు, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, గొంప, రావికమతం ఎంపీటీసీలు గంజి సూర్యనారాయణ, వేపాడ లక్ష్మీనాగేశ్వరావు, పేరెంట్ కమిటీ చైర్మన్ బి.అప్పారావు, జనసేన నాయకులు గంజి శ్రీను, భూషణం, హెచ్ఎం మల్లికార్జున్‌రావు మండల తెలుగు యువత అధ్యక్షుడు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే టి.అర్జాపురం క్లస్టర్ సీఆర్పీ గుంటూరు రామారావు ఆధ్వర్యంలో డోలవానిపాలెం పాఠశాలలో విద్యార్థులతో కలసి పలు పండ్ల మొక్కలు నాటారు.

రోలుగుంట : మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. కుసర్లపూడి జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం శెట్టి మోహన్‌రావు, గ్రీన్ టీచర్ అప్పన రాంబాబు, బి.విద్యావతి తదితరుల ఆధ్వర్యంలో జడ్పీ పాఠశాల ఆవరణతో పాటు గ్రామంలో పలు చోట్ల మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులతో వనం సాక్షిగా వన మహోత్సవ ప్రతిజ్ఞను నిర్వహించారు.

కె.కోటపాడు : మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో విధిగా మొక్కలు నాటాలని ఎంపీడీవో ఎస్. అప్పలరాజు పేర్కొన్నారు. శుక్రవారం వనం-మనం మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం, గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వెలుగు కార్యాలయ అధికారి పి.వెంకటలక్ష్మి, సచివాలయం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయం, విద్యాశాఖ, ఉపాధి హామీ, సచివాలయం, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనం మనంలో భాగంగా ఎంఈవో ఉషారాణి మొక్కలు నాటారు. మామిడి, కానుగ, నేరేడు, బాదం, వేప మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సుజాత, రామలక్ష్మి, రాంబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటినిసంరక్షించే బాధ్యత ప్రజలందరూ తీసుకోవాలని నర్సీపట్నం జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ రాజాన సూర్యచంద్ర, కృష్ణాదేవిపేట అటవీ రేంజర్ సుంకర వెంకటరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఎల్‌పురం హైస్కూల్‌లో వన మహోత్సవంలో భాగంగా స్థానిక జడ్పీ హైస్కూల్‌లో అటవీ, కూటమినాయకులు, ఉపాధ్యాయులు వేప, నేరడి, బొప్పాయి, బాదం, ఉసిరి, సీతాఫలం, కాము తదితర జాతులకు చెందిన మొక్కలు నాటారు. జనసేన మండల నాయకులు రేగుబళ్ల సాంబశివ, సనాదుల ప్రసాద్, రమేష్, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, చిట్టిబాబు, స్కూల్‌కమిటీ చైర్మన్ లగుడు రాజులునాయుడు, హెచ్ఎం. నాగభూషం, డీఆర్‌వో సత్యనారాయణ, సెక్షన్ అధికారి లక్ష్మణ్, ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.


కృష్ణాదేవిపేట : వన మహోత్సవంలో కూటమి నేతలు


కె.కోటపాడు : మొక్కలు నాటుతున్న ఎంపీడీవో అప్పలరాజు

మాకవరపాలెం : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే నారాయణరాజుపేటలో మాజీసర్పంచ్ దువ్వాసీ వెంకటగిరి వనమహోత్సవం సందర్భంగా గ్రామంలో రోడ్డుకి ఇరుపక్కల మామిడి, నేరేడు వంటి మొక్కలు నాటారు.

చీడికాడ : పాఠశాలల్లో వేసిన అన్ని మొక్కలను పెంచేందుకు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ జయప్రకాష్ రావు కోరారు. వనం-మనంలో భాగంగా కోనాం గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ హిమచల, వైస్ ఎంపీపీ కిమిడి చినమ్మలు, సర్పంచ్ సలుగు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాకవరపాలెం : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


చీడికాడ : మొక్కలు నాటుతున్న ఎంపీడీవో జయప్రకాశ్

చోడవరంలో భారీ వర్షం



చోడవరం, ఆగస్టు 30 : అల్పపీడన ప్రభావంతో పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గంటపాటు భారీగా వర్షం కురిసింది. ఆ తరువాత కూడా రాత్రి వరకూ జల్లులు పడుతూనే ఉన్నాయి. అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వర్షాలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భారీ వర్షం కారణంగా పట్టణంలోని ప్రధాన రహదారి, వీధుల్లో వాననీరు రోడ్లపై పారింది.

మాడుగుల : మాడుగులలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నగా పడిన వర్షం మధ్యాహ్నం 3 గంటల తర్వాత భారీగా పడింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో, వ్యవసాయ పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది.

దేవరాపల్లి : మండలంలో శుక్రవారం సాయంత్రం పది మిల్లీమీటర్ల వర్షం పడింది. ఈ వర్షంతో వరినాట్లు వేసిన పొలాలు, సరుగుడు, యూకలిప్టస్, కూరగాయల పంటలకు మేలు చేకూరుతుందని రైతులు తెలిపారు.

తారురోడ్డుపై గోతులు పూడ్చివేత



రోడ్డుపై పిక్కతో కూడిన బూడిద వేస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 30 : గొలుగొండ మండలం పాత కృష్ణాదేవిపేట, పల్లావూరు మార్గంలో గోతులతో నిండిన తారు రోడ్డుపై పిక్కతో కూడిన బూడిద వేశారు. అధ్వానంగా తయారైన ఈ రోడ్డు పరిస్థితిపై 'రహదారులు ఛిద్రం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. పాతకృష్ణాదేవిపేట సర్పంచ్ పందిరి సత్యంనాయుడు స్పందించి ఎన్‌హెచ్- 516 రాజమండ్రి- విజయనగరం జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి అధ్వానంగా ఉన్న రహదారిపై పిక్కలతో కూడిన బూడిద ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీనిపై ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.

కాలువల్లో పూడిక తొలగింపు



పూడిక తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కె.కోటపాడు, ఆగస్టు 30 : మండల కేంద్రంలో ఎట్టకేలకు కాలువల్లోని పూడికలు తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. కాలువ నిర్వహణ అధ్వానంగా ఉండడంపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 29న 'కె.కోటపాడులో కంపు కంపు' శీర్షికన కథనం వచ్చిన నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది పలు వీధుల్లోని కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. దీంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ కార్మికులు ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నేతలు, కార్మికులు

నర్సీపట్నం, ఆగస్టు 30 : ఆర్టీసీ కార్మికులకు నైట్ హాల్ట్ అలవెన్సులు ఇవ్వాలని ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు రాజా నూకరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో డిపోలోని ఇన్‌గేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు నైట్ హాల్ట్ అలవెన్సులు ఇవ్వాలని, ఇంక్రిమెంట్లు, బకాయిలు, ఏపీ జీఎల్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో సెక్రటరీ నారాయణ, జోనల్ సభ్యుడు బొశెం రమణ తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ

» విస్తృతంగా నీటి నిల్వల్లోకి విడిచి పెడుతున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది


రావికమతం : దాసరియ్యపాలెం చెరువులో గంబూషియాలను వదులుతున్న పీహెచ్‌సీ సిబ్బంది


రోలుగుంట : బావిలో చేప పిల్లలను వేస్తున్న తహసీల్దార్, ఆరోగ్య సిబ్బంది

నర్సీపట్నం, ఆగస్టు 30 : నీటి నిల్వల్లోకి గంబూషియా చేపలను శుక్రవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది వదిలారు. ఈ చేపల వల్ల దోమల వ్యాప్తి నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి బెన్నయ్య తెలిపారు. ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో 1500 చొప్పున ఈ చేపలను పంపిణీ చేశామని ఆయన చెప్పారు. ఇప్పటికే రోలుగుంట, బుచ్చెంపేట, వేములపూడి, మాకవరపాలెం, బూరుగుపాలెం, గొలుగొండ, కృష్ణాదేవిపేట, కేడీపురం, నాతవరం పీహెచ్‌సీలకు అందించామన్నారు. డెంగ్యూ, మలేరియా ఉన్న గ్రామాలలో ఫాగింగ్, పిచికారి చేయిస్తున్నామని తెలిపారు. చమ్మచింతలో ఒక డెంగ్యూ కేసు వచ్చిందని తెలిపారు.

రావికమతం : దోమల నివారణకు రావికమతం, కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపరిధిలో సిబ్బంది నీటి నిల్వలు ఉండే ప్రాంతాలు, చెరువుల్లో శుక్రవారం గంబూషియా చేపపిల్లలను విడిచిపెట్టారు. మలేరియా విభాగం సరఫరా చేసిన నాలుగు వందల చేప పిల్లలను మరుపాక, దాసరియ్యపాలెం, కొత్తకోట, టి.అర్జాపురం, కె.గదబపాలెం తదితర గ్రామాల్లో నీరు అధికంగా నిల్వ ఉండే చెరువులు, గుంతలు, మురుగు నీటి కాలువల్లో గంబూషియా చేప పిల్లలను విడిచి పెట్టారు. ఈ చేపల దోమల లార్వాను తినడం వల్ల దోమల వ్యాప్తి బాగా తగ్గుతుందని సిబ్బంది వెల్లడించారు.

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంటలో స్థానిక విజ్ఞాన స్కూల్ వద్ద వినియోగించని కొట్టె సంజీవి బావిలో శుక్రవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది గంబూషియా చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ చేపలను నీటి నిల్వలలో వదలడం వల్ల అవి దోమల లార్వాను తింటాయని, దాంతో దోమలను అరికట్టవచ్చని తహసీల్దార్ వరహాలు, వైద్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


చెరువులో చేపలను వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

ఎట్టకేలకు సాకారం

... 5వ పేజీ తరువాయి

ఎనిమిదిచోట్ల ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయంటూ ఆయా ప్రాంతాల పేర్లు చెప్పుకొచ్చారు. వాటిల్లో రెండో పేరు పూడిమడక హార్బర్. అచ్యుతాపురం మండలవాసులు కాకుండా మిగిలిన ప్రాంతాల వారు ఇదే నిజమేనని నమ్మేట్టుగా ఉన్నాయి ఆయన మాటలు. కానీ పూడిమడక- సీతపాలెం రోడ్డు నుంచి ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదిత ప్రదేశం వరకు చదును చేసి తాత్కాలికంగా మట్టి రోడ్డు వేయడం మినహా మిగిలిన పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలో మే నెలలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో ఫిషింగ్ హార్బర్‌కు మళ్లీ కదలిక వచ్చింది. శుక్రవారం సాయంత్రం ప్రధాని నరేంద్రమోదీ మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడు తూ ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని ఏడాదిన్నర కాలంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

అధికారంలో ఉన్నాం... అణిగిమణిగి ఉండండి

... 5వ పేజీ తరువాయి

జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నీతివంతమైన పాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని, అందుకు తగిన విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలతో కలిసి పనిచేయాలన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని, దీనికి అనుగుణంగా అక్టోబరు నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని లోకేశ్ తెలిపారు. ప్రతి ఎమ్మెల్యే/ఇన్‌చార్జి తమ పరిధిలో సభ్యత్వ నమోదు పక్కాగా చేపట్టాలని సూచించారు. గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. నామినేటెడ్ పదవులపై ఇప్పటికే కసరత్తు జరిగిందని, కష్టపడే వారికి పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. మరోసారి విశాఖ వచ్చినప్పుడు విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటుచేసి, అన్ని విషయాలపై చర్చిస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బదిలీల్లో ముఖ్యమంత్రి పక్కాగా ఉంటూ సమర్థులకు పోస్టింగ్స్ ఇస్తున్నారన్నారు. అదే ఒరవడి కొనసాగించాలని నిర్ణయించారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బాగా పని చేస్తూ అందరినీ సమన్వయం చేసుకుంటున్నారని అభినందించారు.

ఈ సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేసి భారీఎత్తున అవినీతికి పాల్పడిన అధికారి విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా వచ్చేందుకు యత్నిస్తున్నారని, ఇందుకు ఒకరిద్దరు సిఫారసు లేఖలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ అవినీతికి పాల్పడే అధికారిని విశాఖ జడ్పీ సీఈవో పోస్టులో నియమించబోమని హామీ ఇచ్చారు. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో సమస్యలపై మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు నియోజవర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, కిడారి శ్రావణ్‌కుమార్, నాయకులు గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర, ప్రగడ నాగేశ్వరరావు, బుద్దా నాగజగదీష్, చింతకాయల విజయ్, దాడి రత్నాకర్, కోరాడ రాజబాబు, పైలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా హైస్కూలు కమిటీ ఎన్నిక


ఎన్నికైన బూరుగుపాలెం హైస్కూల్ విద్యా కమిటీ ఎన్నిక

మాకవరపాలెం, ఆగస్టు 30 : మండలంలోని బూరుగుపాలెం హైస్కూల్‌లో శుక్రవారం విద్యా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ హైస్కూల్‌కు సంబంధించి 24 మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో 8వ తరగతికి సంబంధించి ముగ్గురు డైరెక్టర్ల ఎన్నిక గతంలో వాయిదా పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికలో 24మంది డైరెక్టర్లకు 13 మంది హాజరయ్యారు. చైర్మన్‌గా ఉప్మాక మరిడియ్య, వైస్ చైర్మన్ గనిశెట్టి లక్ష్మిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నట్టు ఏంఈవోమూర్తి తెలిపారు. తొలి నుంచి ఈ స్కూలు విద్యా కమిటీ ఎన్నికను టీడీపీ, వైసీపీ నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా, తుదకు టీడీపీ బలపరిచిన అభ్యర్థి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి, గోవింద, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేతవానిపాలెంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే

బుచ్చెయ్యపేట, ఆగస్టు 30 : బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెంలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో పీహెచ్‌సీ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఈ గ్రామానికి చెందిన చల్ల నాగరాజు జర్వంతో అస్వస్థతకు గురికావడంతో బుచ్చెయ్యపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటకృష్ణ సేకరించిన రక్తనమూనాలను విశాఖ కెజీహెచ్‌కు పంపించారు. కెజీహెచ్ డెంగ్యూగా నిర్ధారణ కావడంతో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేపట్టారు. ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, నీటి కుండీలను వారానికి ఒక్క రోజు డ్రైగా ఉంచుకోవాలని, జర్వాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, జర్వాలు సోకితే తక్షణం పీహెచ్‌సీలో వైద్య సేవలు తీసుకోవలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు.

ఇల్లు కూల్చివేత అన్యాయమే

జనసేన నేత పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, ఆగస్టు 30 : పట్టణంలోని పంచాయతీ స్థలంలోని ఆక్రమణల పేరుతో నాగలక్ష్మి ఇంటిని, ఆ పక్కనే మరో దుకాణాన్ని పంచా యతీ అధికారులు అన్యాయంగా కూల్చివేశారని జనసేన నియోజకవర్గ ఇంచార్జి పీవీఎస్ ఎన్ రాజు మండిపడ్డారు. కాలువల నిర్మాణం పేరుతో ఈ నెల 27న తమ ఇంటిని అన్యాయంగా కూల్చివేశారంటూ బాధిత మహిళ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి స్థలంలో చేపట్టిన ఆందోళన వద్దకు రాజు, జనసేన కార్యకర్తలు వచ్చి ఆమెను పరామర్శించారు. బాధిత మహిళతో మాట్లాడారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఆమెకు రాజు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజు వెంట బీజేపీ ఇంచార్జి రమణమూర్తి, జనసేన నాయకులు గూనూరు మూలునాయుడు, అల్లం రామప్పారావు, కర్రి రమేష్, సీపీఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

... 5వ పేజీ తరువాయి

డెంగ్యూ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన చల్ల నాగరాజు జర్వంతో బాధపడుతూ గత మంగళవారం వైద్యం కోసం పీహెచ్‌సీకి రావడంతో.. డాక్టర్ వెంకటకృష్ణ రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి పంపారు. ఇతను డెంగ్యూ బారిన పడినట్టు శుక్రవారం రిపోర్టు వచ్చింది.

అదుపులో మలేరియా జ్వరాలు

- వరహాలు దొర, జిల్లా మలేరియా అధికారి, అనకాపల్లి

జిల్లాలో మలేరియా జ్వరాలు అదుపులోనే ఉన్నాయి. వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలో అక్కడక్కడా వైరల్ జ్వరాలు ప్రబలిన మాట వాస్తవమే. వైరల్ జ్వరాలు ప్రబలినట్టు సమాచారం వచ్చిన వెంటనే ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలందరి నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నాం. మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరం మేరకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందిస్తున్నాం.దోమల ఉత్పత్తిని నిరోధించడానికి డ్రైనేజీ కాలవలు, నీటి కుంటల్లో గంబూషియా చేపలను వదులుతున్నాం.

☛ సంక్షిప్తంగా..

ఎస్ఐ 'గొర్లె' బాధ్యతల స్వీకారం



మాడుగుల, ఆగస్టు 30 : మాడుగుల ఎస్సైగా గొర్లె నారాయణరావు శుక్రవారం బాధ్యతలు చేపటారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన దామోదరనాయుడు మాకవరపాలేనికి బదిలీ కాగా, చీడికాడ ఎస్సైగా పని చేసిన నారాయణరావు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ.. నిత్యం శాంతి భద్రతలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా విధులు నిర్వర్తిస్తానని చెప్పారు. ఎస్ఐగా వచ్చిన నారాయణరావుకు సిబ్బంది అభినందనలు తెలిపారు

పింఛన్ల పంపిణీకి రూ.3.1 కోట్లు

నర్సీపట్నం, ఆగస్టు 30 : మునిసిపాలిటీలోని 17 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్లు పంపిణీ చేయాలని కమిషనర్ సురేంద్ర ఆదేశించారు. శుక్రవారం ఆయన సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉదయం 5.30 గంటలకు మొదలు పెట్టి సాయంత్రానికి పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పురపాలక పరిధిలోని 7,175 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.3.10 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.

అలాగే నర్సీపట్నం మండలంలో ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో ఎస్.జయమాధవి చెప్పారు. తొమ్మిది సచివాలయాల పరిధిలో 5272 పింఛనుదారులకు రూ.2.17 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ


నోటు పుస్తకాలు అందజేస్తున్న జస్టిస్ సన్యాసిరావు

కె.కోటపాడు, ఆగస్టు 30 : ప్రస్తుత సమాజంలో బాలికలు ముందంజలో ఉండాలని, అందుకు చదువు ఒక్కటే మార్గమనిడాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ట్రస్ట్ చైర్మన్, రిటైర్డ్ జస్టిస్ ఎన్.సన్యాసిరావు అన్నారు. మండల కేంద్రంలో ఎస్సీ బాలికల వసతిగృహం విద్యార్థులకు శుక్రవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న ఉద్దేశంతో తమ ట్రస్ట్ తరుపున పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, అడ్వకేట్ ఎస్.బెనర్జీ, హెచ్‌డబ్ల్యువో ఎం.నాగలక్ష్మి పాల్గొన్నారు.

మెరుగ్గా వైద్య సేవలు అందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం, ఆగస్టు 30 : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి కోరారు. శుక్రవారం నిర్వహించిన నాతవరం ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సమస్యల గురించి తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరారు. ఆయా పోస్టు భర్తీ, ఫర్నిచర్ అవసరం ఉందంటూ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో డాక్టర్లు రాజేష్‌నాయుడు, ప్రసన్న, సర్పంచ్ గొలగాని రాణి, వైద్య సిబ్బంది బైరాగి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలుడికి వీల్‌చైర్ అందజేత


బాలుడికి వీల్ చైర్ అందజేస్తున్న కన్నూరు చెల్లిబాబు, కమిటీ సభ్యులు

కె.కోటపాడు, ఆగస్టు 30 : మండలంలోని కూండ్రపువానిపాలెంలో దివ్యాంగుడు నరేష్‌కు శుక్రవారం శ్రీసత్యసాయి సేవా సంస్థ భజన మండలి కన్వీనర్ కన్నూరు చెల్లిబాబు వీల్‌చైర్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు మాజీ అధ్యక్షులు జూరెడ్డి రాము, కశిరెడ్డి అప్పలనాయుడు, జె.భీమేశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ, కన్నూరు అప్పలనాయుడు, బండారు నారాయణపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చిరంజీవి జన్మదిన వేడుకలు

రావికమతం, ఆగస్టు 30 : పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు జన్మదిన వేడుకలను ఆయన స్వగ్రామమైన దొండపూడిలో శుక్రవారం ఆ గ్రామ టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

పాఠశాలల అభివృద్ధిలో విద్యా కమిటీలది కీలక పాత్ర : మాజీ మంత్రి బూడి


విద్యా కమిటీల ప్రతినిధులతో ముత్యాలనాయుడు

చీడికాడ, ఆగస్టు 30 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యా కమిటీలు కీలక పాత్ర పోషించాలని మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. వరహాపురంలో ఈ నెల 17న జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో వైసీపీ తరుపున గెలుపొందిన చైర్మన్‌లను గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజుబాబు, పాతాళం చిన్నంనాయుడు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.